సాక్షి
మంచిర్యాల

బుధవారం, 16, ఆగస్టు, 2023



జెండాకు వందనం చేస్తున్న విప్ సుమన్, కలెక్టర్ సంతోష్, జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, చిన్నయ్య

విప్లవాత్మకమైన అభివృద్ధి

- ఆనాటి త్యాగధనుల ఫలితమే స్వాతంత్ర్యం
- కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలు
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: రాష్ట్రం అన్ని రంగాల్లో విప్లవాత్మకమైన అభివృద్ధి పథకాలతో దుసుకెళ్తోందని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ఎంతోమంది త్యాగధనుల ఫలితమే మన స్వాతంత్ర్యమని తెలిపారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రం మంచిర్యాలలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ సుమన్ కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, సబావత్ మోతీలాల్, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యలతో కలిసి పాల్గొన్నారు. విప్ సుమన్ ముందుగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు. ప్రత్యేక వాహనంలో పరేడ్ గ్రౌండ్‌లో పర్యటించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లాలో ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికపై ప్రసంగించారు. ఆయన మాటల్లోనే..

రైతులకు దేశంలో ఎక్కడా లేని ఫలాలు..

వ్యవసాయ రంగంలో రైతుబంధు, రైతుబీమా, నిరంతరంగా ఉచిత విద్యుత్ సరఫరా, రైతు రుణమాఫీతోపాటు వ్యవసాయ విస్తరణాధికారుల నియామకం చేపట్టాం. జిల్లాలో 2016లో 1,37,887 ఎకరాల సాగులో ఉన్న పంటల విస్తీర్ణం 2023 నాటికి 4,45,429 ఎకరాలకు చేరింది. రైతుబంధు పథకం ద్వారా వానకాలం, యాసంగికి సంబంధించి బెల్లంపల్లి నియోజకవర్గంలో 45,664 మంది రైతులకు రూ.64.12 కోట్లు, చెన్నూర్‌లో 47,247 మందికి రూ.56.60 కోట్లు, మంచిర్యాలలో 36,255 మందికి రూ.32.77 కోట్లు మంజూరు చేశాం. రైతుబీమా పథకం ద్వారా ఈ ఏడాది 74,225 మంది రైతులకు ప్రయోజనం కింద చేర్చాం. రుణమాఫీలో భాగంగా మొదటి విడత 6805 మంది రైతులకు రూ.10,18,55,756, రెండో విడతలో 7,564 మందికి రూ.25,34,46,326 మాఫీ చేశాం.

ఉద్యానవన

ఆయిల్‌ఫామ్ పంట సాగు ద్వారా రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు జిల్లాలో 3400 ఎకరాలు లక్ష్యంగా ఎంచుకుని ఇప్పటివరకు 1483.575 ఎకరాలు రిజిస్ట్రేషన్ అయ్యింది. రూ.60 లక్షల రాయితీతో ఆయిల్ ఫామ్ విస్తరణ పథకం ద్వారా 475 మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. ఉద్యానవన అభివృద్ధి పథకం ద్వారా 1,534 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పథకాలను రూ.65 లక్షల రాయితీతో 658 మంది రైతులు లబ్ధి పొందారు. భూమి లేని షెడ్యూల్డ్ తెగలకు చెందిన



ప్రసంగిస్తున్న విప్ బాల్క సుమన్

575 మంది దసలి రైతులు పట్టుగూళ్లను అడవిలోని 5000 ఎకరాల్లో సాగు చేస్తూ రూ.30 లక్షల వరకు దసలి పట్టు గూళ్లు, లక్ష పట్టుగుడ్లు ఉత్పత్తి చేస్తూ ప్రతీ ఏడాది ఉపాధి పొందుతున్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థలో పోర్టబులిటీ..

ప్రజాపంపిణీ వ్యవస్థలో ఆధునిక పద్ధతుల ద్వారా రాష్ట్రంలో ఏ ప్రదేశం నుంచి అయినా నిత్యావసర వస్తువులు పొందే వెసులుబాటుకు పోర్టబులిటీ ప్రవేశ పెట్టాం. గత యాసంగిలో జిల్లాలో 262 కొనుగోలు కేంద్రాల ద్వారా 19 బాయిల్డ్ రైస్‌మిల్లులు, 35 రా రైస్‌మిల్లుల ద్వారా 1,86,113 మెట్రిక్ టన్నుల ధాన్యం 32,542 మంది రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.381.56 కోట్లు ఖాతాల్లో జమ చేశాం.

నీటి పారుదల: జిల్లాలో జూన్ 9న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా రూ.90 కోట్లతో 10వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు పర్దాన్‌పల్లి ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశాం. కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి చెన్నూర్ నియోజకవర్గానికి రూ.1,658 కోట్లతో 10 టీఎంసీల నీటిని 101 గ్రామాల్లో దాదాపు లక్ష ఎకరాలు అందించేందుకు అనుమతులు అందాయి.

మత్స్యశాఖ: మత్స్యకారుల సహకార సంఘాల ఏర్పాటుతోపాటు 363 సీజనల్ చెరువుల్లో 121.395 లక్షలు, 2 పెరినియల్, 6 రిజర్వాయర్లలో 99.58 లక్షల చేపపిల్లలు, 60 లక్షల రొయ్యపిల్లలు విడుదలకు ప్రతిపాదనలు రూపొందించాం.

పశు సంవర్ధక శాఖ: రెండో విడత గొర్రెల పంపిణీతోపాటు కులవృత్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం, ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాలతోపాటు రెండో విడతలో 1,762 మంది గొల్ల, కుర్మ యాదవులకు గొర్రెల పంపిణీ జరుగగా ఇంకా 2,250 యూనిట్లు పంపిణీ చేస్తాం.

పల్లె ప్రగతి: పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డ్, వైకుంఠ ధామం, నర్సరీలను పూర్తిగా వినియోగంలోకి తీసుకు వచ్చాం. 2019 నుంచి 2023 వరకు పల్లెప్రగతి కింద చెన్నూర్ నియోజకవర్గంలోని 102 గ్రామ పంచాయతీల్లో రూ.92.33 కోట్లు, బెల్లంపల్లిలో 114 గ్రామ పంచాయతీల్లో రూ.103.12 కోట్లు, మంచిర్యాలలో 124 గ్రామ పంచాయతీల్లో రూ.61.66 కోట్లు ఖర్చు ఖర్చు చేశాం.

గ్రామీణాభివృద్ధి: స్త్రీనిధి పథకం కింద రూ.414.63 లక్షలు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.360.45 లక్షల ప్రగతి సాధించాం. ఉపాధి హామీ పథకంలో 1,21,030 మందికి జాబ్‌కార్డులు అందించి పని కల్పించాం.

పురపాలక సంఘాలు: పురపాలక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వ పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. 2014 నుంచి ఇప్పటివరకు మంచిర్యాల మున్సిపాలిటీలో రూ.345 కోట్లు, చెన్నూర్‌లో రూ.203 కోట్లు, నస్పూర్‌లో రూ.103.05 కోట్లు, క్యాతన్‌పల్లిలో రూ.210 కోట్లు, లక్సెట్టిపేటలో రూ.70.10 కోట్లు, బెల్లంపల్లిలో రూ.145 కోట్లు, 2019 నుంచి మందమర్రిలో ఇప్పటివరకు రూ.195 కోట్లతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నాం.



విద్యార్థిని ప్రదర్శన

విద్యారంగం: ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తూ విద్యార్థినీ, విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్య అందిస్తున్నాం. మొదటి విడతలో జిల్లాలో 248 పాఠశాలలను ఎంపిక చేసి రూ.344 లక్షలతో 97 వంటశాలలు, రూ.1186 లక్షలతో 155 శౌచాలయాలు, రూ.1126 లక్షలతో 135 ప్రహరీలు నిర్మించాం.

వైద్యరంగం: మాతాశిశు సంక్షేమం కోసం రూ.17 కోట్లతో 200 పడకల సంరక్షణ కేంద్రాన్ని నిర్మించి సేవలందిస్తున్నాం. జిల్లాలో 27 ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి 1,446 మంది రోగులకు 2,379 రక్తపరీక్షలు చేశాం. కంటి వెలుగు ద్వారా 4,11,080 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 68,924 మందికి రీడింగ్ అద్దాలు, 58,557 మందికి దూరపు చూపు అద్దాలు అందించాం. అమ్మఒడి వాహనాల ద్వారా 30,203 మంది గర్భిణులు, 108 అంబులెన్స్ వాహనాలు 14 ఏర్పాటు చేసి 8,609 మందికి అత్యవసర సేవల నిమిత్తం ఆసుపత్రులకు చేరవేశాం.

దళితబంధు దేశంలోనే ఆదర్శం..

దళిత కుటుంబాలు ఆర్థిక స్వావలంబన సాధించడం కోసం ప్రభుత్వం ×దళితబంధు¤ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున కేటాయిస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ పథకం ద్వారా నియోజకవర్గానికి 100 యూనిట్ల చొప్పున కేటాయించగా జిల్లాలో మొత్తం 313 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.30 కోట్లు జమ చేశాం. రెండో విడతలో నియోజకవర్గానికి 1100 యూనిట్లు మొత్తం జిల్లాకు 3443 దళిత కుటుంబాలకు రూ.344 కోట్ల లక్ష్యంగా ప్రక్రియ కొనసాగుతోంది. ఈ పథకం ద్వారా 4422 మంది లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రూ.68.51కోట్లు రుణ సదుపాయం కల్పించాం.

అర్హులకు పట్టాలు అందజేత..

సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలోని భూముల్లో నివాసం ఉంటున్న అర్హులైన వారికి జీవో నంబరు 76 ప్రకారం క్రమబద్ధీకరణ ద్వారా బెల్లంపల్లి, నస్పూర్, శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్ మున్సిపాలిటీల్లో ఇప్పటివరకు 18,480 దరఖాస్తులు రాగా, 10,841 దరఖాస్తులను పట్టాల పంపిణీ కోసం పరిగణనలోకి తీసుకున్నాం. కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం 29శాతం ఇంక్రిమెంట్లు, 18 వేల మందికి వారసత్వ ఉద్యోగాలు, రిటైర్మెంట్ వయస్సు 61కి పెంపు, దసరా, దీపావళి పండుగ అడ్వాన్స్‌లు ఇస్తున్నాం.

ఆవిష్కరణల పరిశీలన

ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో జిల్లా విద్యార్థులు సృష్టించిన ఆవిష్కరణలు మోటార్‌తో నడిచే సైకిల్, ప్రాజెక్టర్లను విప్ సుమన్ పరిశీలించారు. అటవీ, సంక్షేమం, వ్యవసాయం, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య, మహిళ, శిశు, వయోవృద్ధుల, విద్య, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. స్వయం సహాయక సభ్యులకు రూ.30 కోట్ల చెక్కును అందజేశారు.



నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ సుమన్, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి



విద్యార్థుల నృత్య ప్రదర్శన



మోటార్‌తో నడిచే సైకిల్‌పై విప్ సుమన్



సమరయోధుడికి విప్, జెడ్పీ చైర్‌పర్సన్ సన్మానం



చెక్కు అందిస్తున్న విప్ సుమన్, కలెక్టర్ సంతోష్



క్రికెట్ పోటీల విజేత జట్టుకు బహుమతి ప్రదానం

న్యూస్‌రీల్

జెండావిష్కరణలో అపశ్రుతి

తాండూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో జాతీయ జెండావిష్కరణలో మంగళవారం అపశ్రుతి చోటు చేసుకుంది. వైద్యుడు కుమారస్వామి జాతీయ పతాకాన్ని తలకిందులుగా ఎగురవేశారు. జరిగిన పొరపాటును కొందరు గుర్తించడంతో మళ్లీ కిందికి దింపి ఎగురవేశారు.



తలకిందులుగా ఎగురవేసిన జాతీయ జెండా

బీట్ అధికారి సస్పెన్షన్

వేమనపల్లి: నీల్వాయి అటవీ రేంజ్ పరిధిలోని మల్లంపేట బీట్ అధికారి నాగరాజచారిని సస్పెండ్ చేసినట్లు నీల్వాయి అటవీ రేంజ్ అధికారి ఇక్బాల్‌హుస్సేన్ తెలిపారు. విధులకు హాజరుకాకుండా నిర్లక్ష్యం చేస్తున్నారనే కారణంతో డీఎఫ్ఓ శివ్ ఆశీష్‌సింగ్ సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. కాగా, గత పది రోజుల క్రితం మల్లంపేట బీట్‌లోని కొండంపేట అటవీ ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన వారు నీలగిరి ప్లానిటేషన్ ఆక్రమణకు యత్నించారు. యుద్ధప్రాతిపదికన ఉన్నతాధికారులు రంగ ప్రవేశం చేసి ఆక్రమణకు గురైన ప్లానిటేషన్‌లో మొక్కలు నాటించారు. ఈ తతంగమంతా జరిగిన బీట్ అధికారి విధులకు దూరంగా ఉండడం సస్పెన్షన్‌కు కారణమైందని తెలుస్తోంది.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్



జిల్లా కోర్టు ప్రాంగణంలో..



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో..

ఘనంగా వేడుకలు

మంచిర్యాలక్రైం: జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ రాజు ఆయా కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయమూర్తి కే.ప్రభాకర్ రావు జెండాను ఎగురవేయగా.. న్యాయమూర్తులు అర్పితరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి నందగోపాల్, సీఐ నరేందర్, జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశీష్ సింగ్, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి అజయ్‌బాబు ఆయా కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెండావిష్కరణ

నస్పూర్: పట్టణ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యాక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు నడిపల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నాయకులు పాల్గొన్నారు.



డీసీపీ కార్యాలయంలో జెండాకు వందనం

నస్పూర్: సమీకృత జిల్లా అధికారుల భవనం వద్ద కలెక్టర్ బాదావత్ సంతోష్ జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.రాహుల్, మోతీలాల్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



రైలెక్కిన జేసీబీలు

మందమర్రిరూరల్: గూడ్స్ రైలు బండిలో వందలాది జేసీబీలు మంగళవారం మంచిర్యాల వైపు రైలు మార్గం గుండా రవాణా అయ్యాయి. వందలాది జేసీబీలను రైల్లో తరలించడం చూపరులను ఆకట్టుకుంది. మందమర్రి రావస్ కాలనీ సమీపంలోని ఓవర్ బ్రిడ్జి వద్ద ఒక్కసారిగా జేసీబీల రవాణా కనిపించడంతో రహదారిపై వెళ్లే వాహనదారులు వాహనాలు నిలిపి ఆసక్తిగా చూశారు.

ఆకట్టుకున్న శకటాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల బాలుర పాఠశాల మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన వేడుకల్లో శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. అటవీ, వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, మత్స్య, పశు సంవర్ధక, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి పారుదల, పంచాయతీ, వైద్య, ఆరోగ్య, ఆబ్కారీ, అగ్నిమాపక, రోడ్లు–భవనాలు, రెండు పడక గదుల ఇళ్లు, పంచాయతీరాజ్, విద్య, ఇంటర్మీడియెట్ విద్య, పరిశ్రమలు, సింగరేణి, క్రీడా–యువజన సర్వీసులు, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆయా శాఖల చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై శకటాల ప్రదర్శన నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులను ప్రభుత్వ విప్ సుమన్ సత్కరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు జాతీయ భావం పెంపొందించేలా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆలపించిన గీతం ఆహూతులను ఆకట్టుకుంది. జిల్లాలోని వివిధ పాఠశాలలు కార్మెల్ హైస్కూల్, కేంద్రీయ విద్యాలయం, ట్రినిటీ హైస్కూల్, ఎస్టీ మోడల్ స్కూల్, కేజీబీవీ, డీఏఎల్‌వో విద్యార్థుల నృత్యాలు అబ్బురపరిచాయి. విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు.



జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ శకటం

ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణ ప్రారంభం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రంగంపేట్‌లో ఉన్న మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణ ప్రారంభించినట్లు ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరు సుధాకర్ తెలిపారు. ఈ నెల 15నుంచి 30 వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఇస్తామని, పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఈ నెల 12న జరిగిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విన్నర్స్, రన్నర్స్‌కు మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకుడు కందికట్ల మధు, కోచ్ నాగేంద్ర, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



విన్నర్స్, రన్నర్స్‌కు మెమొంటోలు ప్రదానం

క్లుప్తంగా

వృద్ధుడి అదృశ్యం


కిష్టయ్య (ఫైల్)

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లి గ్రామానికి చెందిన జుమ్మిడి కిష్టయ్య అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కుశ్నపల్లికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కిష్టయ్య ఈ నెల 9వ తేదీన సాయంత్రం పక్కనే ఉన్న కోణంపేట గ్రామానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడతో కుటుంబీకులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య చేసుకుంది. జీఆర్పీ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల శివారులో మంగళవారం సుమారు 25 ఏళ్ల గుర్తు తెలియని మహిళ ధానపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచారు. వివరాలకు 8328512176, 9490871984 నంబర్లలో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

భార్యతో గొడవపడి.. గోదావరిలో దూకి..

- యువకుడి బలవన్మరణం


గణేశ్ (ఫైల్)

దండేపల్లి: భార్యతో గొడవపడిన ఓ యువకుడు మూడ్రోజులకు శవమై తేలాడు.. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్సెట్టిపేట మండలం అంకతిపల్లెకు చెందిన గనవేని గణేశ్ (25) భార్య రజితతో ఈ నెల 12న గొడవపడ్డాడు. దీంతో రజిత పుట్టింటికి వెళ్లగా మనస్తాపం చెందిన గణేశ్ మరుసటిరోజు ఇంటినుంచి వెళ్లిపోయాడు. అదేరోజు సాయంత్రం గూడెం గోదావరి వంతెన వద్ద అతడి ద్విచక్ర వాహనం కనిపించింది. దీంతో అతడు గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావించిన కుటుంబ సభ్యులు మూడ్రోజులుగా నదీతీరం వద్ద వెతికారు. మంగళవారం అతడి శవం లభ్యమైంది. భార్యతో గొడవపడి మనస్తాపంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండచ్చని మృతుడి సోదరుడు శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉత్తమ ఉద్యోగులకు 'ప్రశంస'


ప్రభుత విప్ సుమన్, కలెక్టర్ సంతోష్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న జిల్లా వ్యవసాయాధికారి కల్పన

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని వివిధ శాఖల్లో పని చేస్తున్న 122మంది ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా వీరికి ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.


రమేశ్, పశుసంవర్ధ కశాఖాధికారి; సత్యం, చీఫ్ ప్లానింగ్ అధికారి; శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ; వినోద్‌కుమార్, జిల్లా వెనుకబడిన తరగతులశాఖ; ఫణీందర్, బెల్లంపల్లి డీఎల్పీవో; సంపత్‌కుమార్, డీపీఆర్వో; శేషరావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ; రజని, కలెక్టరేట్ డీ సెక్షన్ సూపరింటెండెంట్; రోహిత్, కలెక్టరేట్ బీ సెక్షన్ సూపరింటెండెంట్; శ్రీనివాస్, కలెక్టరేట్ బీ సెక్షన్ సూపరింటెండెంట్; సునీల్‌కుమార్, కలెక్టరేట్ ఈ మేనేజర్; సుమన్, హెచ్‌హెచ్‌పీ; కల్పన, నాయబ్ తహసీల్దార్; విజయ, సీనియర్ అసిస్టెంట్; చందర్, సీనియర్ అసిస్టెంట్; అన్నపూర్ణ, సీనియర్ అసిస్టెంట్; అర్చన, జూనియర్ అసిస్టెంట్; నారాయణ, కలెక్టరేట్ జమేదార్; శ్రీనివాస్, కలెక్టరేట్ అటెండర్; రజిత, కలెక్టరేట్ ఆఫీస్ సబార్డినేట్; రాజ్‌మహ్మద్, బెల్లంపల్లి తహసీల్ సీనియర్ అసిస్టెంట్; గౌరమ్మ, బెల్లంపల్లి ఆర్డీవో ఆఫీస్ అటెండర్; సుబ్బరాయుడు, డీఎంహెచ్‌వో; గజానన్, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి; స్వామి, విద్యుత్ శాఖ ఏడీఈ; రమేశ్, విద్యుత్ శాఖ ఏఎఈ; రవళి, వెటర్నరీ అసిస్టెంట్; రాజేందర్, సీపీవో ఆఫీస్ డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్; సునీల్, డీపీఆర్వో ఫొటోగ్రాఫర్; నవీన్, డీపీఆర్వో ఆఫీస్; రవీందర్, ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్

రాష్ట్రాభివృద్ధిలో సింగరేణి పాత్ర కీలకం


ఉత్తమ కార్మికుడిని సన్మానిస్తున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: రాష్ట్రాభివృద్ధిలో సింగరేణి పాత్ర కీలకమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జీఎం కార్యాలయ ఆవరణలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ.. స్వచ్ఛ పక్వాడాలో భాగంగా ఏరియాకు సింగరేణి వ్యాప్తంగా మొదటి బహుమతి వచ్చిందని తెలిపారు. అనంతరం వివిధ గనుల నుంచి ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైనవారు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన సింగరేణి పాలిటెక్నిక్, సింగరేణి హైస్కూల్ విద్యార్థులు, భారత సైన్యంలో 17 ఏళ్లు సేవలందించిన భాస్కర్‌ను సన్మానించి ప్రశంసాపత్రాలు అందించారు. ఏరియాలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన ఆర్కే 5, సివిల్ డిపార్ట్‌మెంట్, ఎస్సార్పీ ఓసీ గనుల అధికారులు, ఉద్యోగులకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి, అధికారుల సంఘం వైస్ ప్రెసిడెంట్ అపెక్స్ ఏవీ రెడ్డి, సంఘం అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ఎస్వోటూ జీఎం రఘుకుమార్, ఇందారం, శ్రీరాంపూర్ ఓసీల పీవోలు శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి, ఆర్కే 7 గ్రూపు ఏజెంట్ రాముడు, ఇన్‌చార్జి ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎంలు పీ అరవిందరావు, చిరంజీవులు, డీవీ రావు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, నాయకులు షేక్ బాజీసైదా, శంకర్‌రావు, సారయ్య, రమేశ్, భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీ ద్వారా నిరంతర విద్యుదుత్పత్తి


జెండా ఆవిష్కరిస్తున్న సీటీసీ సంజయ్‌కుమార్

జైపూర్: ఎస్టీపీపీ నిరంతరం విద్యుదుత్పత్తి చేస్తూ రాష్ట్రానికి వెలుగులు అందిస్తోందని, అందరి సహకారంతో సంస్థ రాణిస్తోందని ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ సూర్ పేర్కొన్నారు. జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ అడ్మిన్ భవన్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జీఎం బసివిరెడ్డి, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్‌తో కలిసి జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 100శాతం పీఎల్ఎఫ్‌తో దేశంలో ఎస్టీపీపీ నంబర్ వన్‌గా నిలిచిందని చెప్పారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన ఇప్ప నరేశ్, విజయ్‌కుమార్, ముకుందం మహేశ్‌ను శాలువాలతో సన్మానించి బహుమతులు అందించారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కూలీ దుర్మరణం


భూమయ్య (ఫైల్)

మంచిర్యాలక్రైం: కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి కూలీ మృతి చెందాడు. వివరాలు.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం బోదంపల్లికి చెందిన సబ్బాని భూమయ్య (43) ఏడు నెలల క్రితం జిల్లా కేంద్రానికి ఉపాధి నిమిత్తం భార్య జ్యోతితో వచ్చాడు. వీరిద్దరూ కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీలో ఓ పాత బిల్డింగ్ మరమ్మతు పనులకు వెళ్లారు. పనుల్లో ఉండగా పైనుంచి సిమెంట్ దిమ్మె విరిగి మీదపడగా భూమయ్య తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కూలీలు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భూమయ్యకు భార్య జ్యోతితోపాటు కూతుళ్లు మల్లిక, శివాని, కుమారుడు అంజయ్య ఉన్నారు. కాగా, కాంట్రాక్ట్ నిర్లక్ష్యమే భూమయ్య మృతికి కారణమని స్థానికులు, కుటుంబ సభ్యులు ఆరోపించారు. పైన కూల్చివేత పూర్తి కాకుండానే శిథిలాలు భూమయ్యతో ఎత్తించడంతో సిమెంట్ దిమ్మె విరిగి మీదపడి ప్రమాదం జరిగిందని తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా, బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు.

సింగరేణి ఉద్యోగులకు బహుమతులు


బహుమతులు అందుకున్న ఉద్యోగులు

తాండూర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బీపీఏ ఓసీ- 2 ఎక్స్‌టెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన సింగరేణి ఉద్యోగులు బహుమతులు అందుకున్నారు. మైన్స్ లెవల్‌లో ఏకు రాజయ్య, ఎండీ దస్తగిరి, అడప రమేశ్, ఏరియా స్థాయిలో ఓవర్‌మన్ నరేశ్, లక్కిరెడ్డి శ్రీపాల్‌కు బహుమతులు అందజేశారు. ప్రాజెక్ట్ అధికారి ఉమాకాంత్, కాలరీ మేనేజర్ మహేశ్, సంక్షేమాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సిర్పూర్(టీ): సిర్పూర్(టీ) గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్(టీ) శివారులో పేకాడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తీన్ పత్తా ఆడుతున్న నలుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.4,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

నేతకానీలను గుర్తించండి

చెన్నూర్: నేతకాని సామాజిక వర్గానికి ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి నేతకాని కుల సంఘం రాష్ట్ర నాయకుడు దుర్గం అశోక్ మంగళవారం హైదరాబాద్‌లో కలిసి అందజేశారు. చెన్నూర్ నియోజకవర్గంలో నేతకాని కులస్తుల ఓట్లు అధికంగా ఉన్నాయని తెలిపారు. తన సేవలను గుర్తించి పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరారు.

అట్టహాసంగా ఏఐటీయూసీ మహాసభ


వీటీ అబ్రహం స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీతారామయ్య, నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఏరియా స్థాయి ఏఐటీయూసీ తొమ్మిదో మహాసభ మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మార్కెట్ ఏరియాలోని కామ్రేడ్ వీటీ అబ్రహం స్తూపం వద్ద నివాళులర్పించిన యూనియన్ నాయకులు ర్యాలీగా సీఈఆర్ క్లబ్ వరకు వెళ్లారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య హాజరై మాట్లాడారు. సింగరేణిలో ఏఐటీయూసీ బలంగా ఉందని తెలిపారు. సంస్థలో సమస్యలు పేరుకుపోతున్నా టీబీజీకేఎస్ యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. టీబీజీకేఎస్ ఓడిపోతుందనే భయంతోనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడంలేదని విమర్శించారు. ఈ సందర్భంగా యూనియన్ మందమర్రి బ్రాంచ్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సలేంద్ర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా భీమనాథుని సుదర్శన్, సహాయ కార్యదర్శిగా సోమిశెట్టి రాజేశం, సంయుక్త కార్యదర్శిగా కంది శ్రీనివాస్, మైనింగ్ స్టాఫ్ కార్యదర్శిగా గోపతి సత్యనారాయణ, కాంట్రాక్ట్ వర్కర్స్ కార్యదర్శిగా జెట్టి మల్లయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పెద్దపల్లి బానయ్య, గాండ్ల సంపత్, దినేశ్ ఎన్నికయ్యారు. బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాసభలో నాయకులు అక్బర్‌అలీ, కంది శ్రీనివాస్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

'శివకుమార్‌ను విధుల్లోకి తీసుకోవాలి'


దీక్ష శిబిరంలో కార్మికుడు, నాయకులు

నస్పూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లో సింగరేణి కాంట్రాక్ట్ కన్వేయన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్న పెండెం శివకుమార్‌ను అకారణంగా తొలగించారని, అతడిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నాయకులు కార్మికులతో కలిసి శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండోరోజుకు చేరింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. శివకుమార్‌కు ముందస్తు సమాచారం ఇవ్వకుండా విధుల నుంచి తొలగించారని తెలిపారు. అధికారులు స్పందించి అతడిని వెంటనే విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షురాలు వేల్పుల కుమారి, కార్మికుడు శివకుమార్, నాగరాజు, స్వరూప, లక్ష్మి, జంబి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


హామీ ఇచ్చి విస్మరించిన కాంట్రాక్ట్ యాజమాన్యం

- ఆర్వీఆర్ కంపెనీ తీరుపై కాంట్రాక్ట్ కార్మికుల ఆగ్రహం

కాసిపేట: మందమర్రి ఏరియా కేకే ఓపెన్‌కాస్ట్‌లోని ఆర్‌వీఆర్ కంపెనీలో పని చేస్తున్న డ్రైవర్లు, కాంట్రాక్టర్లు గత నెల సమ్మె చేసి అధికారుల హామీతో విరమించగా కాంట్రాక్ట్ యాజమాన్యం మాత్రం మళ్లీ మొదటికి వచ్చింది. కొంతమందికి హామీ ప్రకారం కాకుండా పాత వేతనం వేయడంతో సోమవారం రాత్రి కార్యాలయం వద్ద వాదనలు జరిగాయి. గత నెల వేతనాల పెంపుపై సుదీర్ఘంగా సమ్మె చేయగా రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆధ్వర్యంలో సదరు కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపి వేతనాల పెంపుపై హామీ ఇచ్చారు. సమ్మె చేసిన కాలంలో ఆరు మస్టర్లు.. ప్రతీనెల రెండు మస్టర్ల చొప్పున కలిపి ఇవ్వనున్నట్లు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో సోమవారం వేతనాలు చెల్లించగా క్యాంపులో ఉండే సుమారు 40 మందికి రెండు మస్టర్లు వేతనం పడలేదు. మెస్ బిల్లు, గుడ్‌విల్‌గా అందించే రూ.వెయ్యి కూడా ఇవ్వలేదు. దీంతో సదరు కార్మికులు రాత్రి కార్యాలయం వద్ద వాదనకు దిగారు. ప్రస్తుతం 40 మంది కార్మికులు ఇతర ప్రాంతాలకు చెందిన వారు కావడంతో కంపెనీ 'విభజించు.. పాలించు' అనే సిద్ధాంతంతో పని చేస్తోందని ఆరోపించారు. తమకు అన్యాయం జరిగిందని, ఇప్పటివరకు చేసిన వేతనాలు చెల్లిస్తే తాము వెళ్లిపోతామని అధికారులతో మొరపెట్టుకున్నారు. ఇప్పటికిప్పుడు వెళ్లిపోతే కుదరదని, కాంట్రాక్టర్ సంస్థ స్థానిక పోలీసులు నచ్చజెప్పినా వినలేదు. రెండ్రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలపడంతో వేచి చూస్తున్నారు. కాగా, యాజమాన్యం దూరప్రాంతాల వారిని తెచ్చి స్థానిక కార్మికులకు సంబంధం లేకుండా వారితో పని చేయించుకుంటోంది. సమ్మెలో స్థానిక కార్మికులతో వారు కూడా పాల్గొనడంతో కక్షగట్టి వేతనాలు ఆపి ఇబ్బందులకు గురి చేస్తోందనే ఆరోపణలున్నాయి. స్థానికులు కూడా వారికి మద్దతు ప్రకటించి సమస్య పరిష్కరించకుంటే అవసరమైతే మళ్లీ సమ్మె చేయనున్నట్లు హెచ్చరిస్తున్నారు.

భౌతిక దాడులు సహించబోం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్
- దాడిలో గాయపడ్డ నాయకుడికి పరామర్శ


వరప్రసాద్‌ను పరామర్శిస్తున్న ప్రవీణ్‌కుమార్

తాండూర్: బీఎస్పీ శ్రేణులపై అధికార పార్టీ నాయకులు భౌతిక దాడులకు పాల్పడితే సహించేది లేదని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. ఇటీవల బెల్లంపల్లిలో ఫ్లెక్సీ ఏర్పాటు వివాదంలో గాయపడిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోర్లపల్లి వరప్రసాద్‌ను మండలంలోని కాసిపేట్ గ్రామంలోని ఆయన నివాసంలో మంగళవారం పరామర్శించారు. వివాదం జరిగిన తీరు, దాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. బెల్లంపల్లి-1 టౌన్ ఎస్‌హెచ్‌వో శంకరయ్యతో ఫోన్‌లో మాట్లాడారు. దాడికి గురైన వరప్రసాద్‌పై పోలీసులు కేసు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయలేదని, ఇప్పటివరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని అడిగారు. విచారణ చేపడుతున్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా దిగజారి పోయిందని తెలిపారు. ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నాయకులు ఆటవిక పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. దాడులు ఇలాగే కొనసాగిస్తే ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రజల ధన, మాన ప్రాణాలకు రక్షణ కావాలంటే బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. నాయకులు ఏవీ గుణ, రాజేశ్, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్వోకు ఉత్తమ అవార్డు


అవార్డు అందుకుంటున్న ఎఫ్ఆర్వో పూర్ణచందర్

సిర్పూర్(టీ): సిర్పూర్(టీ) రేంజ్ ఎఫ్ఆర్వో పూర్ణచందర్ అడవుల సంరక్షణ, ఉత్తమ సేవలకుగాను స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బంగారు పతకం, అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీసీసీఎఫ్, వైల్డ్‌లైఫ్ వార్డెన్ అండ్ సీఈవో కంపా లోకేశ్ జైస్వాల్ చేతుల మీదుగా కేవీఎస్ బాబు గోల్డ్ మెడల్, అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. పూర్ణచందర్‌కు అవార్డు రావడంపై రేంజ్ పరిధిలోని ఎఫ్ఎస్వోలు, ఎఫ్‌బీవోలు, అటవీశాఖ సిబ్బంది హర్షం వ్యక్తంజేశారు.

నీటమునిగి మతిస్థిమితం లేని మహిళ మృతి


శారద (ఫైల్)

తాండూర్: ఇంట్లోంచి వెళ్లిన మతిస్థిమితం లేని మహిళ నీటమునిగి మృతి చెందింది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేచిని గ్రామపంచాయతీ పరిధి బారెపల్లి గ్రామానికి చెందిన గురుగుల శారద (40) కొద్దినెలల క్రితం మతిస్థిమితం కోల్పోయింది. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున శారద ఇంట్లోంచి వెళ్లింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. జక్కులపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న గుర్నుల ఆనంద్ వ్యవసాయ నీటి కుంటలో శవమై కనిపించింది. ఆమె పుట్టింటికి వెళ్తూ ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెంది ఉంటుందని కుటుంబీకులు అనుమానిస్తున్నారు. మృతురాలి అక్క దోకే సుశీల భర్త పోశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జనావాసాల్లోకి నెమలి


నెమలిని అప్పగిస్తున్న యువకులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని బీ జోన్ ఆర్వే-4 గడ్డ ప్రాంతంలో మంగళవారం ఓ నెమలి సమీప అటవీ ప్రాంతం నుంచి జనావాసాల్లోకి వచ్చింది. దానిని కుక్కలు వెంబడించడాన్ని గమనించిన కాలనీ యువకులు ప్రశాంత్, కళ్యాణ్ రక్షించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దానిని అప్పగించగా పోలీస్ సిబ్బంది నెమలిని అటవీ అధికారులకు అందజేశారు. నెమలిని కాపాడిన యువకులను పోలీస్, అటవీ అధికారులు అభినందించారు.